
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
బుధవారం 13 నవంబరు 2024



న్యూస్ బాక్స్

కోతులకు ఆహారం రెండు వేల జరిమానా

జైపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రహదారులపై కోతులకు ఆహారం వేస్తే కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల ఎఫ్‌ఆర్‌వో రత్నాకర్‌రావు, జైపూర్ ఫారెస్టు సెక్షన్ అధికారి రామకృష్ణ సర్కార్‌లు తెలిపారు. మంగళవారం జైపూర్ అటవీ ప్రాంతంలోని రహదారిపై గస్తీ నిర్వహిస్తుండగా బత్తుల శ్రీనివాస్ కోతులకు అరటిపండ్లు వేయ గా రూ.2 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అరటి పండ్లు రోడ్లపై వేయ డంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, కోతులు కూడా వాహనాల కింద పడి మృతి చెందుతు న్నాయన్నారు. వాహనదారులు కోతు లకు ఆహారం ఇవ్వవద్దని పేర్కొన్నారు.

బాలుడి వైద్య ఖర్చులకు ఎల్‌వోసీ అందజేత

దండేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నరేడ్ల రమేష్ కుమారుడు నరెడ్ల సాయి వర్షిత్ వైద్య ఖర్చుల కోసం ఎస్‌వోసీని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అందజేశారు. వర్షిత్ అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. ఎమ్మెల్యే స్పందించి మంగళవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో వైద్య ఖర్చుల కోసం రూ. 2 లక్షల ఎల్‌వోసి పత్రాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.



అండాళమ్మ కాలనీలో పేరుకుపోయిన చెత్త

దుర్వాసనతో వేగేదెలా..?

- చెత్త డంపింగ్‌తో కంపుకొడుతున్న కాలనీ
- మంచినీటి ట్యాంక్ చుట్టూ మున్సిపల్ చెత్త
- రెండు రోజులుగా తాగునీటి సరఫరా బంద్
- కుళ్లిన పదార్థాలతో అనారోగ్యం బారిన ప్రజలు

మంచిర్యాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపాలిటీలోని అండాళమ్మ కాలనీ మున్సిపల్ చెత్తతో కంపు కొడుతోంది. రహదారులు, ఇళ్లకు సమీపంలో చెత్తడంప్ చేస్తుండటంతో దుర్వాసనకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డంప్‌యార్డును ఎత్తివేయాలని కాలనీవాసులు ఆందోళనలు చేపట్టినప్పటికీ ఫలితం ఉండటంలేదు. ఫలితంగా కాలనీలోని ప్రజలు అనారోగ్యం బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నివాస గృహాలకు సమీపంలో ఏర్పాటు చేసిన డంప్ యార్డులో పట్టణంలోని 36 వార్డులకు సంబంధించిన చెత్త వేస్తుండటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది.

ప్రశ్నిస్తే కక్షసాధింపు చర్యలు...

మున్సిపాలిటీ చెత్త కారణంగా దుర్వాసన వస్తుండటంతో ప్రశ్నించిన కాలనీవాసులపై అధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చెత్త డంప్ విషయమై గతంలో మున్సిపల్ వాహనాలను కాలనీవాసులు అడ్డుకొనడంతోపాటు అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించారు. డంప్ యార్డు తొలగించి, మరోచోట ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా విన్నవిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సమస్యలు చెప్పుకుంటే ఇంటి పన్నులు చెల్లించాలని, లేకుంటే ఇళ్లకు తాళం వేస్తామని, నీటి సరఫరా బంద్ చేస్తామని, కరెంటు కనెక్షన్ తీసి వేయిస్తామని బెదిరింపులకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయని వాపోతున్నారు.

డంప్ యార్డు ఏర్పాటులో జాప్యమెందుకు...?

మంచిర్యాల పట్టణానికి డంప్‌యార్డు ఏర్పాటు చేయడంలో దశాబ్దాల కాలంగా జాప్యం జరుగుతూనే ఉంది. డంప్ యార్డుకోసం హాజీపూర్ మండలం వేంపల్లి శివారు కొత్త చెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలో సర్వే నంబర్లు 154, 155, 159లలో 21ఎకరాల భూమిని గతంలో ఉపయోగించారు. స్థానికులు అభ్యంతరంతో అక్కడ చెత్త వేయడాన్ని నిలిపివేశారు. వర్షాకాలంలో కుళ్లిన పదార్థాలు చెరువులోకి చేరే ప్రమాదం ఉన్నందున చెత్తడంప్‌ను నిలిపివేయాలని గ్రామస్తులు కొందరు హైకోర్టులో పిటీషన్ వేయడంతో మళ్లీ అండాళమ్మ కాలనీయే దిక్కయింది.

శాశ్వత పరిష్కారం ఎప్పుడు..?

వేంపల్లి సమీపంలో చెత్త డంప్‌ను నిలిపి వేసినప్పటి నుంచి అండాళమ్మ కాలనీ సమీపంలోని

మిగతా 7లో..

అదిరేటి లుక్కుకు...

హెయిర్ స్టైల్, టాటూస్‌పై యువత క్రేజ్

7లో



రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందేదెప్పుడు..?

- పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తల నిరీక్షణ
- నాలుగు నెలలు గడుస్తున్నా పట్టించుకోని సర్కార్
- ప్రభుత్వం కనికరించాలని వినతి

8లో



గ్రూప్ 3 పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 17,18 తేదీల్లో జరగనున్న గ్రూప్ 3 పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, ఏసీపీ ప్రకాష్, డీఈవో యాదయ్యతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్షకు జిల్లాలో 48 కేంద్రాలను ఏర్పాటు చేసి అధికారులు, సిబ్బందిని నియమించామన్నారు. 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30వరకు, 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రంలోకి ముఖ్య పర్యవేకులకు మాత్రమే అనుమతిస్తామన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, హాజరు పట్టికలు, ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లను పర్యవేక్షించాలన్నారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులకు గ్రౌండ్‌ఫ్లోర్ కేటాయించాలన్నారు. డీసీపీ మాట్లాడుతూ పరీక్ష నిర్వహణలో భాగంగా స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నా పత్రాలు ఓఎంఆర్ షీట్లు సామగ్రి తరలింపు ప్రక్రియ పోలీసు బందోబస్తు మధ్య జరుగుతుందన్నారు.

ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని ఓటర్ల జాబితా పరిశీలకులు సురేంద్రమోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాసర్‌రావు, హరికృష్ణ, చంద్రకళతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు ఇది మంచి అవకాశామని, ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల సహకారం అవసరమన్నారు. మరణించిన వారి వివరాలు, మార్పులు, తొలగింపులు, సవరణలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారు ఒకే పోలింగ్ బూత్‌లోకి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. నూతన ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 26న యువత, విద్యార్థులతో 2కే రన్ నిర్వహించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టం ద్వారా 397 దరఖాస్తులు రాగా అన్నింటిని పరిష్కరించామన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 747 పోలింగ్ కేంద్రానలు గుర్తించామన్నారు. అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓటర్ల జాబితా పరిశీలకులు

ముగిసిన వీవోఏల ధర్నా



ధర్నా శిబిరంలో కూర్చున్న వివోఏలు, నాయకులు

నస్పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు పెంచాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ, వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 48గంటల ధర్నా మంగళవారం ముగిసింది. తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రాన్ని అందించారు. నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి కాలయాపన చేస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ హామీ ప్రకారం రూ.20వేల వేతనం, రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. మూడు నెలల రెన్యూవల్ పద్ధతిని తీసివేయాలన్నారు. బకాయి ఉన్న స్త్రీ నిధి ఇన్సెంటివ్ వెంటనే గ్రామ సంఘాలకు చెల్లించాలన్నారు. గ్రామ సంఘం నుంచి రూ.మూడు వేల గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. దుంపల రంజిత్ కుమార్, కుంటాల కుమార్, దుర్గం రాములు, పోచం,రజిత, అనిత, శారద, మహేష్, దాసు, వెంకటేష్, భాగ్య లక్ష్మి, అనూష, లక్ష్మన్, సురేష్, రమాదేవి పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి కాపాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

భీమారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భీమారంలో కోతుల వల్ల ఇబ్బందులు పడుతున్నామని, వాటి బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుముందు బస్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు వెయ్యి కోతులు సంచరిస్తున్నాయని, ఇండ్లలోకి చొరబడి వృద్ధులు, మహిళలపై దాడులు చేయడంతో పాటు ఇంట్లోని కూరగాయలు, సరుకులను, పంటలను ధ్వంసం చేస్తున్నాయన్నారు. కోతులు ఎక్కడ దాడి చేస్తాయో తెలియక బయటకు వెళ్లాలంటే భయంగా ఉందన్నారు. ఈ విషయంపై అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని, లేకుంటే రానున్న ఎన్నికలను అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కెట్ విలువ ప్రకారం

నష్టపరిహారం చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసిత రైతుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

నస్పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ హైవే విస్తరణలో భూముల కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని హాజీపూర్, లక్షెట్టిపేట మండలాలకు చెందిన రైతులు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం భూములకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు రోడ్డు విస్తరణపనులు నిలిపివేయాలన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్ అందించారు. కలెక్టర్ కుమార్‌దీపక్ రైతులతో మాట్లాడారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం కారణంగా భూములు, ఇండ్లు కోల్పోయామని, మళ్ళీ భూములను నష్ట పోవాల్సి వస్తోందని పలువురు రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. రైతులకు మద్దతుగా వచ్చిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ ఇప్పటికే ఎల్లంపల్లి వలన నష్టపోయి ఉన్న వారిని మరింత నష్టపోకుండ న్యాయం చేయాలన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వలన నష్టపోయిన విషయం ఉన్నతాధికారులకు తెలిదని, స్థానిక పరిస్థితులపై వివరించాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉందన్నారు. న్యాయం జరిగే వరకు రైతుల పక్షాన బీజేపీ అండగా ఉంటుందన్నారు. నిర్వాసిత రైతులు సత్తయ్య, స్వామిరెడ్డి, గొల్ల తిరుపతి, కొండల్‌రెడ్డి, లక్ష్మన్, పెట్టం తిరుపతి, పాదం శ్రీనివాస్, లతో పాటు బీజేపీ నాయకులు సత్రం రమేష్, కుర్ర చక్రి, కిశోర్, ప్రవీణ్, బుద్దె లక్ష్మన్ పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీ భూ సేకరణ ప్రజాభిప్రాయ సమావేశం రణరంగంగా మారింది. వికారాబాద్ కలెక్టర్, అదనపు కలెక్టర్, కడా ప్రత్యేకాధికారులకు వ్యతిరేకంగా దూసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, కానిస్టేబుల్స్‌తో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్

బెల్లంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రిలో తాండూర్, తాల్లగురిజాల, నెన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. మందులకు సంబంధించి ఎక్స్‌పైరీ డేట్‌ను చూడాలని, ఆరోగ్య కేంద్రాల్లో ఎప్పటికప్పుడు మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హైరిస్క్ గర్భవతులను జిల్లా ఆసుపత్రికి, లేదా మాతా శిశు కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతకుముందు వంద పడకల ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. వార్డులను తనిఖీ చేసి వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుధాకర్‌నాయక్, అనిత, ప్రసాద్, ఎస్‌వో వెంకటేశ్వర్లు, సీఎస్‌వో బుక్కా వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం

- పది మందికి గాయాలు



కుక్క కాటుతో గాయాలు

బెల్లంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పిచ్చి కుక్కలు మంగళవారం స్వైర విహారం చేశాయి. పలువురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. పట్టణంలోని స్టేషన్ రోడ్డు కాలనీకి చెందిన గణేష్, అర్విక్, బూడిదగడ్డ బస్తీకి చెందిన షేక్ మహబూబ్, భూపెల్లి విహాన్స్, గుండేటి రాజు, బాబుక్యాంపునకు చెందిన హర్షవర్ధన్, టేకుల బస్తీకి చెందిన సుశీలతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మరో ముగ్గురిని కుక్కలు కరిచాయి. చేతులు, కాళ్లపై కుక్కలు గాయపరిచాయి. పలువురికి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యం అందించారు. కుక్కలను నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



నస్పూర్‌లో కుల గణన సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

నస్పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్ మున్సిపాలిటీలోని 13వ వార్డు నాగార్జున కాలనీలో జరుగుతున్న సర్వేను మంగళవారం పరిశీలించారు. అన్ని అంశాలను అడిగి తెలుసుకుని ఇంటి యజమానుల పత్రాలను చూసి ఫారంలో నింపాలన్నారు. కుటుంబ వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ తోట శ్రీనివాస్ ఉన్నారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): అంగడిబజార్, యాపల్ ఏరియాలో చేపట్టిన సర్వేలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటా సర్వేకు వస్తున్న వారికి వివరాలు వెల్లడించాలని పేర్కొన్నారు. ఎలాంటి తప్పులు దొర్లినా తర్వాత ఇబ్బందులు పడాల్సి ఉంటుందని తెలిపారు. నెల రోజులు గడువు ఉన్నందున సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా సేకరిస్తున్నట్లు తెలిపారు.

చదువు ఒత్తిడితో బాలిక ఆత్మహత్య

మంచిర్యాల అర్బన్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): చదువు ఒత్తిడి తట్టుకోలేక బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. బాలిక రమీషా హుస్సేన్(12) పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. చదువుల్లో వెనుకబడి ఉండటంతో మనస్తాపానికి గురైంది. మంగళవారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన బాలిక గదిలోకి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు పాల్పడిన బాలిక మంచిర్యాల తహసీల్దార్ రహ్మతుల్లా హుస్సేన్ కుమార్తె. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

జీజీహెచ్‌లో మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం



ఆసుపత్రిలో కత్తితో మతి స్థిమితం లేని వ్యక్తి

గర్మిళ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జన రల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో మంగళవారం మతిస్థిమితం లేని వ్యక్తి చేతి లో కత్తి పట్టుకుని వీరంగం సృష్టించాడు. కత్తితో ఆసుపత్రిలోకి ప్రవేశించి వైద్యం చేయాలని లేదంటే పొడుస్తానంటూ కత్తి చేత పట్టుకుని వీరంగం సృష్టించాడు. అతని ప్రవర్తనను గమనించిన ఆసుపత్రి సిబ్బంది మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించి నచ్చజెప్పి బయటకు పంపించారు. కత్తి పట్టుకుని లోపలికి రావడంతో ఆసుపత్రి వద్ద విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది ఏమి చేస్తున్నారంటూ పలువురు ఆందోళనకు గుర య్యారు. ఘటనపై ఆసుపత్రికి వచ్చిన రోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

డబ్బులు చెల్లించకపోతే ఆత్మహత్యే శరణ్యం

- సహారా బాధితుడు సంజీవ్

మందమర్రి టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సహారా ఇండియా డబ్బులు చెల్లించకపోతే ఆత్మహత్యే శరణ్యమని రామన్‌కాలనీకి చెందిన బాధితుడు చిలుక సంజీవ్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2018లో రెండు లక్షల రూపాయలు సంస్థ ఏజెంట్ శ్రీనివాస్‌రావు ఫిక్స్ డిపాజిట్ చేయించాడని తెలిపారు. 2020 నాటికి రూ.5,14,092 ఇస్తామని బాండ్ ఇచ్చారని, గడువు పూర్తయి మరో నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదన్నారు. దీంతో కుటుంబంలో గొడవలు వచ్చాయని, ప్రస్తుతం భార్య పిల్లలు కూడా వెళ్లి పోయారని, తినడానికి తిండిలేని స్థితిలో ఉన్నానని తెలిపారు. తనతోపాటు మందమర్రిలో బాధితులు చాలా మంది ఉన్నారని, ఏజెంట్లు డబ్బుల చెల్లింపు విషయంలో చొరవ చూపడం లేదని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందన లేదని వారు పేర్కొన్నారు. పది రోజుల్లో డబ్బులు చెల్లించనట్లయితే ఆత్మహత్య తప్ప వేరే మార్గం లేదన్నారు.

గంజాయి మొక్క పెంచుతున్న వ్యక్తి అరెస్టు

తాండూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాండూర్ బారెవాడకు చెందిన ఇడిదినేని నాగయ్య ఇంటి సమీపంలో గంజాయి మొక్క పెంచుతుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. సీఐ కుమారస్వామి ఆదేశాల మేరకు సిబ్బందితో వెళ్లి తనిఖీ చేపట్టగా గంజాయి మొక్క లభించిందన్నారు. ఎవరైనా గంజాయి సాగు, విక్రయం, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

దండేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నంబాల గ్రామం నుంచి వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. నంబాల గ్రామానికి చెందిన శిరూప మధుకర్ బియ్యం కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తుండగా, నమ్మదగిన సమాచారం మేరకు గూడెం వద్ద తనిఖీ చేయగా సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామన్నారు. మధుకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు

దహెగాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దహెగాం మండల కేంద్రానికి చెందిన తోడే టి శ్రీరామ్(6)పై పిచ్చి కుక్క దాడి చేసి గాయపరిచింది. శ్రీరామ్ మంగళవారం ఉదయం రోడ్డుపై ఆడుకుంటుండగా కుక్క దాడి చేయగా చెవి, ఛాతీపై గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న వ్యక్తులు కుక్కను తరిమివేశారు. శ్రీరామ్‌ను తల్లిదండ్రులు ఆసుపత్రికి తరలించారు.

అడవి పంది దాడిలో రైతుకు తీవ్ర గాయాలు

పెంచికలపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అడవి పంది దాడిలో రైతు లావుడే శివరాంకు గాయాలయ్యాయి. ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శివరాం ఉదయం చేనులో వ్యవసాయ పనులు చేస్తుండగా అడవి పంది ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో శివరాంకు చెవి భాగంలో, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన చుట్టు పక్కల రైతులు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కాగజ్‌నగర్‌కు తరలించారు. శివరాంకు నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

దహెగాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలం నుంచి వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న ఏడు పశువులను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. సమాచారం మేరకు వాహనాల తనిఖీ చేపడుతుండగా పట్టుబడినట్లు తెలిపారు. పశువులను కోసిని గోశాలకు తరలించి వాహనాన్ని సీజ్ చేశామని చెప్పారు. వాహన యజమాని వలిషైదర్, డ్రైవర్ మండిగ భీమేష్, అక్కెపల్లి శంకర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

నెన్నెల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దీక్షితులు అన్నా రు. బూత్‌లో వంద మందిని సభ్యులుగా చేర్పి అధ్యక్షుడిని ఎన్నుకోవాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు శైలెందర్ సింగ్ అధ్యక్షతన మం గళవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నిక లకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన తీరుపై ప్రజలకు వివరించాలన్నారు. ఉపాధ్యక్షులు శేఖర్, గడ్డం శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కోట వంశీ, నాయకులు సతీష్, వెంకటేశ్వర్లు, రాజన్న, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వేమనపల్లి, (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్య క్షుడు రాపర్తి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. ప్రతీ కార్యకర్త క్రియాశీల సభ్యుడై ఉండాలన్నారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మడె శ్రీకాంత్, విజయ్, రవి, అంజి, పుల్లయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): ప్రతీ కార్యకర్త క్రియాశీల సభ్యుడై ఉండాలని బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్ అన్నారు. తాండూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, నాయకులు గాదె శ్రీనివాస్, శేషగిరి, చిరంజీవి, కుమార్, శ్రీనివాస్, సీతల్, ప్రదీప్, సురేష్, విగ్నేష్, నాగబూషణం తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఉంగరం అందజేత

రామకృష్ణాపూర్, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపూర్ ఆర్కే సీఓఏ క్లబ్ ఎదురుగా క్వార్టర్‌లో నివాసముంటున్న జయంత్ కుమార్ ఎస్ఆర్‌పీ ఓపెన్ కాస్టు గనిలో అడిషనల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు, మంగళవారం ఉదయం ఇంటికి చెత్త తీసుకువెళ్లడానికి వచ్చిన ట్రైసైకిల్‌లో చెత్తను వేశాడు. చెత్తలో 5 గ్రాముల బంగారు ఉంగరం పోవడంతో సూపర్‌వైజర్ సదానందంకు ఫోన్ చేసి విషయం తెలిపాడు. పారిశుధ్య కార్మికుడు శాంత్‌కుమార్, ఇతర మహిళా కార్మికులు డంపు యార్డు వద్ద వెతకగా ఉంగరం లభించగా అధికారికి అందజేశారు. ఉంగ రాన్ని అప్పగించిన కార్మికులను, సూపర్‌వైజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపయోగంగా వైకుంఠధామాలు



లక్ష్మీపూర్‌లోని వైకుంఠధామం

● దారి సౌకర్యం లేక గ్రామస్థుల తంటాలు

● వాగు ఒడ్డున అంతిమ సంస్కారాలు ● పట్టించుకోని అధికారులు

రెబ్బెన, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో నిర్మించిన వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పల్లెల్లో డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లతో పాటు అంతిమ సంస్కారాల నిర్వహణకు వైకుంఠధామాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. వీటి నిర్మాణానికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను అధికారులు కేటాయించారు. వాటిని చేరుకోవటానికి దారి సౌకర్యం కల్పించక పోవడంతో లక్షలు వెచ్చించిన వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డులు నిరూపయోగంగా దర్శనమిస్తున్నారు.

నిర్మించి వదిలేశారు..

మండలంలోని గంగాపూర్ పంచాయతీ పరిధిలోని సుమారు 2,300 జనాభా ఉంది. లక్ష్మీపూర్ పంచాయతీలో 1,200 వరకు జనాభా ఉన్నారు. రెండు పంచాయతీలకు మంజూరైన వైకుంఠదామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డుల నిర్మాణం కోసం గంగాపూర్ శివవారులో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. ఒక్కొ పంచాయతీకి ఎకరం చొప్పున స్థలం కేటాయించారు. రూ.12 లక్షలతో వైకుంఠ ధామం, రూ.2లక్షల వ్యయంతో సెగ్రిగేషన్ షెడ్లు, ఉపాధిహామీ నిధులతో డంపింగ్ యార్డులు నిర్మించారు. అక్కడికి వెళ్లేందుకు దారి సౌకర్యం లేక పోవడంతో నిరుపయోగంగా మారాయి. గంగాపూర్, లక్ష్మీపూర్ పంచాయతీలకు అంతిమ సంస్కారాల నిర్వహణకు గ్రామానికి ఆనుకొని ఉన్న వాగులే దిక్కుగా మారాయి. భూమి ఉన్న ప్రజలు తమ కుటుంబ సభ్యుల అంతిమ సంస్కారాలను సొంత స్థలంలో నిర్వహిస్తున్నారు. భూమి లేని వారు వాగు ఒడ్డున దహన సంస్కారాలు చేపడుతున్నారు.

ఆయా గ్రామాల నుంచి ట్రాక్టర్లలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు, సెగ్రిగేషన్ షెడ్డుకు తీసుకెళ్లేందుకు దారి లేక పోవటంతో చెత్తాచెదారాన్ని రోడ్డు పక్కన ఖాళీ స్థలాల్లో పడేసి నిప్పంటిస్తున్నారు. దీంతో అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు వీలుగా నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు సైతం అలంకార ప్రాయంగా మారాయి. వైకుంఠధామానికి వెళ్లేందుకు కావాల్సిన దారి ఒక రైతుకు చెందిన పట్టా భూమి ఉండడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దారి ఏర్పాటు చేయాలి:

- వి అరుణ్, గంగాపూర్



గంగాపూర్‌తో పాటు లక్ష్మీపూర్ పంచాయతీ పరిధి ప్రజల కోసం వాగు ఒడ్డున నిర్మించిన వైకుంఠధామాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలి. దారి మధ్యలో పట్టా భూమి ఉండడంతో రైతులు ఒప్పుకోవడం లేదు. అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలి.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లలో ఖాళీగా ఉన్న అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన పని చేసేందుకు అర్హత గల ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలలో 2, అర్బన్ రెసిడెన్షియల్‌లో 1 అకౌంటెంట్ పోస్టులు, 5 ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపాపు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 20వ తేదీ లోగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాఠశాలల తనిఖీ

కౌటాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో హనుమంతు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని సూచిం చారు. మధ్యాహ్న భోజనంలో మెనూను తప్పకుండా పాటించాలని ప్రధానోపాధ్యాయుడు గణపతికి సూచించారు.

'ఆర్టీసీ డీఎంపై చర్యలు తీసుకోవాలి'

ఆసిఫాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్మికులను వేధిస్తున్న ఆర్టీసీ డీఎం విశ్వనాథ్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. డిపో ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ సిబ్బంది డ్యూటీల విషయంలో డీఎం వేధింపులకు గురి చేస్తున్నారని, మూడు రోజుల మాస్టర్‌ను రెం డు రోజులకు కుదించి ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు పూర్తి విచారణ జరిపి డీఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఏఐటీయూసీ నాయకులు ఉన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో వివిధ పోస్టుల భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నామని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎంవీ రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టెనో- టైపిస్టు-1, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్-1 పోస్టులను భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. ఈ నెల 22 సాయంత్రం ఐదు గంటలలోగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, న్యాయ సేవాసదన్, జిల్లా న్యాయస్థానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 23 నుంచి 28 వరకు దరఖాస్తులను పరిశీలించి అర్హులైన అభ్యర్థులకు డిసెంబరు 2న హాల్ టికెట్లు జారీ చేస్తామని తెలిపారు. డిసెంబరు 7న ఉదయం 10.30 గంటలకు రికార్డు అసిస్టెంట్, మధ్యాహ్నం 3 గంటలకు స్టెనో టైపిస్టు, టైపిస్ట్ కంమ్ అసిస్టెంట్ పోస్టులకు జిల్లా కేంద్రంలోని న్యాయస్థానం భవన సముదాయంలో రాత పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

వాంకిడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఇందాని జిల్లా పరిషత్ పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు హక్కులు, రక్షణపై అవగాహన కల్పించారు. నేటి బాలలే రేపటి పౌరులని వారి హక్కులను కాపాడాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, కార్యదర్శి దినేష్, కౌన్సిలర్ రవళి, సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, నసీర్, ఉస్మాని, పీతాంబర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఉపాధి కల్పించడమే ధ్యేయం



మాట్లాడుతున్న నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్

సిర్పూర్(యు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలోని ఆదివాసీలకు సుస్థిర జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు నాబార్డ్ నిధులతో ఏకలవ్య ఫౌండేషన్ చేయూత నిస్తోందని తెలంగాణ నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్ అన్నారు. పెద్దదోబా గ్రామంలో ఆదివాసీలకు కిరాణ దుకాణం, పిండి గిర్ని, మేకల పెంపకానికి 18 మందికి మంజూరైన 85 లక్షల 30 వేల రుపాయలు చెక్కులను లబ్ధిదారులకు సీజేఎం ఉదయ్ భాస్కర్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, భీం మనుమడు కుమరం సోనేరావ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలను ప్రారంభించారు. అంతకు ముందు ఆదివాసీలు డప్పు చప్పుళ్లతో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఏకలవ్యఫౌండేషన్ ప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కుమరంభీం విగ్రహానికి తెలంగాణ నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉదయ్‌భాస్కర్ మాట్లాడారు. బాబ్జిపేట కేంద్రంగా సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో ఐదు వందల మంది లబ్ధిదారులకు ఏకలవ్య ఫౌండేషన్ ద్వార ఉపాధి కల్పించామని చెప్పారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో నాబార్డ్ నిధులతో రోడ్లు బాగు చేస్తామన్నా రు. విద్యార్థులకు చదువుతో పాటు, వ్యవసాయం, ఇరిగేషన్, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 22 రైతు ఉత్పాదక సంఘాలు పని చేస్తున్నాయని వివరించారు. ఆసిఫాబాద్ జిల్లాలో ఏడు రైతు ఉత్పాదక సంఘాలున్నాయన్నారు. రైతులకు డ్రోన్ పైలట్ ప్రాజెక్ట్ అందించామని, వాటి నిర్వాహణ ఏకలవ్య ఫౌండేషన్ చూసుకుంటుందన్నారు. రైతు ఉత్పాదక సంఘాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కుమరంభీం మనుమడు కుంరం సోనేరావ్ మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ కోసం జోడేఘాట్ కేంద్రంగా కుమరంభీం ఉద్యమాలు చేసి అసువులు బాసారని చెప్పారు. ఇప్పటికీ తమ భూములకు పట్టాలు లేవన్నారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ఛైర్మన్ వెంకట్‌రావ్, సీఈవో మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

డీఎంహెచ్‌వోకు సన్మానం

వాంకిడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సీతారాం మొదటి సారిగా వాంకిడి ఆసుపత్రి తనిఖీకి రావడంతో ఆయనను మంగళవారం వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నాగేందర్, వినయ్, హెచ్‌ఈవో రవిదాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన విచారణ

వాంకిడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వాంకిడి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల అస్వస్థత సంఘటనపై రెండో రోజు కూడా విచారణ కొనసాగింది. మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి విచారణ చేపట్టారు. సోమవారం ఆర్డీవో లోకేశ్వర్ రావు ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా వైద్యాధికారి, మిషన్ భగీరథ సిబ్బంది చేపట్టిన విచారణకు సంబంధించిన వివరాలను మంగళవారం అదనపు కలెక్టర్ నమోదు చేసుకున్నారు. విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, ఏఎన్ఎం, ఉపాధ్యాయులను విడివిడిగా విద్యార్థినుల అస్వసతకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు కారణాల ఇంత వరకు తెలియరాలేదు.

పార్టీని బలోపేతం చేయాలి

దహెగాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు ధనుంజయ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ప్రభాకర్‌గౌడ్,దామోదర్, మల్లేష్, సంజీవ్, రాజన్న, కేదార్, మహేష్, వెంకటేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

బెజ్జూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తిడి గ్రామంలో తాగునీటి సమస్య తీర్చాలని మంగళవారం యువకులు ఎంపీడీవో గౌరి శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో మిషన్ భగీరథ పైపు లైన్ ద్వారా నీరు రాక పోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయంలో కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ నీరు రాక పోవడంతో బావులు, చేతి పంపుల నీటిని తాగాల్సి వస్తుందని నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయాల్లో కార్తీక సందడి

కాగజ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని పలు ఆలయాల్లో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగవారం పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో రావి చెట్టు వద్ద దీపాలను వెలిగించారు. అనంతరం హారతి కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ వార్డులకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బెజ్జూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్ఎల్‌సీ అంజన్న అన్నారు. మంగళవారం మండలంలోని కుశ్నపల్లి గ్రామంలో బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద రూ.436 సాధారణంగా కట్టితే మరణిస్తే రూ.2 లక్షలు, ప్రధాన మంత్రి జీవన సురక్ష బీమా యోజన కింద రూ.20 తో ప్రమాద బీమా రూ.2 లక్షలు వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది గణపతి, వసంత్ తదితరులు పాల్గొన్నారు.



సింగరేణిలో క్రీడలకు పెద్దపీట



మాట్లాడుతున్న క్రీడల గౌరవ కార్యదర్శి మాస్కుల కార్తీక్

మందమర్రిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో క్రీడలకు యాజమాన్యం పెద్దపీట వేస్తోందని, పతకాలు సాధించే క్రీడాకారులకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తున్నదని మందమర్రి ఏరియా క్రీడల గౌరవ కార్యదర్శి మాస్కుల కార్తీక్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో కార్మికుల అథ్లెటిక్స్ పోటీలకు ఆయన హాజరై మాట్లాడారు. అథ్లెటిక్స్ పోటీల్లో కోలిండియాలో పతకాలు సాధించాలన్నారు. సింగరేణిలో యువ కార్మికుల సంఖ్య అధికంగా ఉందని, క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. కార్మికక్రీడాకారులకు యాజమాన్యం చేయూతనిస్తోందని చెప్పారు. సింగరేణి ఎస్టేట్ అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం, మానసికోల్లాసం లభిస్తుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శివ, ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు బానయ్య తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళిక కమిటీ సభ్యుల పర్యటన

రెబ్బెన, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని వివిధ గనులను ప్రణాళిక కమిటీ సభ్యులు బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. ఖైరిగూడ ఓసీకి చేరుకొని పని స్థలాలు అన్ని విభాగాల అధిపతులతో వార్షిక ప్రణాళికపై చర్చించారు. అనంతరం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రణాళిక కమిటీ సభ్యులు కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ జీఎం ఎ.మనోహర్, ప్రాజెక్టు ప్లానింగ్ జీఎం కె.సాయిబాబు, మార్కెటింగ్ జీఎం రవి ప్రసాద్, ఎజీఎం సురేందర్ రాజు, అడిషన్ మేనేజర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు రెగ్యులర్‌గా హాజరు కావాలి

శ్రీరాంపూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విధులకు రెగ్యులర్‌గా హాజరు కావాలని ఆర్కే 7 గ్రూపు ఏజెంట్ రాజేందర్, ఆర్కే న్యూటెక్ గని మేనేజర్ స్వామిరాజు అన్నారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 17 మంది ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. విధులకు హాజరుకాకుండా ఉద్యోగాలు కోల్పోతే ఆర్థికంగా ఇబ్బందులు పడుతారని సూచించారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి పాల్ స్రుజన్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, ఉత్తమ ఉద్యోగి మస్కు మల్లేష్, పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ లైజన్ సెల్ ప్రారంభం

శ్రీరాంపూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ లైజన్ సెల్ ప్రారంభమైంది. ఎస్సీ, ఎస్టీ ఛైర్మన్ బక్కి వెంకటయ్య ఈ విభాగాన్ని ప్రారంభించారు. సింగరేణిలో లైజన్ సెల్‌ను ప్రారంభించడం చారిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు. ఈ సెల్ ద్వారా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఎలాలంటి సమస్యలు ఉన్నా చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ప్లానింగ్) వెంకటేశ్వర్ రెడ్డి, జీఎం(పర్సనల్) కవితానాయుడు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్ రావు, ఎస్టి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్, శ్రీరాంపూర్ ఎస్సీ లైజన్ అధికారి కిరణ్ కుమార్, సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్, కార్యదర్శి నక్క సుమన్, తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ పిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ ఆర్కే న్యూటెక్ పిట్ కమిటీని మంగళవారం గని ఆవరణలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ హాజరయ్యారు. పిట్ కార్యదర్శిగా ఉప్పల సంపత్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శిగా జైపాల్ రెడ్డి, జనరల్ షిఫ్ట్ కార్యదర్శిగా అట్లూరి అనిల్ కుమార్, రిలే కార్యదర్శులుగా అడ్డూరి అనిల్, రాజ్ కుమార్, కృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజు, మరో 50 మంది ఎన్నికయ్యారు.

ఫెన్సింగ్ ఏర్పాటు

మందమర్రిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని కేకే 5 గని వెనక మంగళవారం అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న శంకర్‌పల్లి గ్రామస్థులు ఫెన్సింగ్ ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు బొగ్గు గని విస్తరణలో భాగంగా పైన స్థలం కుంగిపోతున్నదని, ఇటువైపుగా వస్తే ప్రమాదాల బారిన పడతారని అందుకే ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామస్థుల వినతి మేరకు దారిని వదిలిపెట్టారు. ఇటువైపుగా రావద్దని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

సర్ఫేస్ ఉద్యోగాలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీ, ఎస్ఆర్‌పీ 1 గనులలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు మంగళవారం జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. 16 డిసిగ్నేషన్ల కోసం కమిటీ సభ్యులైన ఇన్‌చార్జి ఎస్ఓ టు జీఎం శ్రీధర్ రావు, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది. దీనికి 34 మంది కార్మికులు హాజరయ్యారు. వారు ఎంచుకున్న ఉద్యోగాలకు అనుగుణంగా తగిన శిక్షణ అందించిన అనంతరం విధులు అప్పగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఓసీపీ గని మేనేజర్ బ్రహ్మాజీ రావు, రక్షణాధికారి శ్రీనివాస్, సంక్షేమాధికారులు బి. శంకర్, ఎస్ఎండీ గౌస్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థులు బ్యాంకు ఖాతాలను తెరువాలి

నస్పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు బ్యాంకు ఖాతాలు తెరువాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాంపల్లి శాఖ మేనేజర్ నరసింహా స్వామి అన్నారు. తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కళాజాత, మిమిక్రీ మ్యాజిక్ షో విద్యార్థులను ఆకట్టుకున్నాయి. స్వయం సహాయక సంఘాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు సభ్యులుగా చేరాలన్నారు. పీఈటీ చంద్రశేఖర్, ఎఫ్ఎల్‌సీకౌన్సిల్ స్వరూప, బ్యాంకు క్షేత్రాధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

శ్రీరాంపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలుడి కుటుంబానికి న్యూటెక్ గని కార్మికులు ఆర్థిక సహాయం అందించారు. మంచిర్యాలలోని ఏసీసీ ప్రాంతానికి చెందిన శ్యాంకుమార్-శైలజ దంపతుల కుమారుడు దుర్గావరుణ్(4) సాంబారులో పడి గాయపడగా, వరంగల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కార్మికులు రూ.16 వేల 400ల జమ చేసి కుటుంబానికి మంగళవారం అందజేశారు. నర్సయ్య, కస్తూరి చంద్రశేఖర్, రమేష్, ఆర్.రాజు, పి.రోహిత్, కె. మనోజ్ పాల్గొన్నారు.

ఆశ్రమపాఠశాల హెచ్‌ఎం, సిబ్బందిపై బదిలీ వేటు

వాంకిడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వాంకిడి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల అస్వస్థతకు కారుకులైన పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌ను కాగజ్‌నగర్, ఏఎన్‌ఎం సేవంత, కుక్ హరికిషన్, కమల బంబార, పెంటయ్యను కమ్మర్‌గాం పాఠశాలలకుబదిలీ చేసినట్లు డీటీడీవో రమాదేవి మంగళవారం తెలిపారు. విచారణ కమిటీ కలెక్టర్‌కు నివేదికలు అందించారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఐటీడీఏ పీవో సంఘటనకు బాధ్యులైన నలుగురిపై బదిలీ వేటు వేసినట్లు డీటీడీవో తెలిపారు.



అదిరేటి లుక్కుకు..

హెయిర్ స్టైల్, టాటూస్‌పై యువత క్రేజ్

బెల్లంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువత రకరకాల హెయిర్ స్టైల్, టాటూలపై ఆసక్తి చూపుతారు. సినిమా హీరో, క్రీడాకారుల హెయిర్ స్టైల్ ఫాలో అవుతున్నారు. దీంతో పలు పట్టణాల్లో కంపెనీల సెలూన్‌లు సైతం ఏర్పాటువుతున్నాయి.

హెయిర్ స్టైల్‌పై యువత ఆసక్తి

యువత నెలకో మాదిరిగా హెయిర్ స్టైల్ చేయించుకుంటున్నారు. ఫంక్, షార్ట్‌టోఫ్సీ, హెయిర్ కట్స్, మిల్ట్రీ, ఫంక్ కటింగ్, మైకెల్ కటింగ్ వంటి వివిధ హెయిర్ స్టైల్స్ చేయించుకుంటున్నారు. హెయిర్ కటింగ్‌తో పాటు గడ్డంను కూడా వివిధ స్టైల్స్‌లో కట్ చేయిస్తున్నారు. ప్రస్తుతం గడ్డం ట్రెండ్ సైతం నడుస్తుండడంతో యువత ఆసక్తి చూపుతూ వివిధ రకాల షేప్‌లలో పెంచుతున్నారు. ఇటీవల యువత వివిధ రకాల ఆకృతుల్లో గడ్డం పెంచడంపై ఆసక్తి చూపుతోంది.

పెరుగుతున్న టాటూ ట్రెండ్

నేటి యువతలో టాటూలపై క్రేజ్ ఏర్పడింది. శరీరంలో కనిపించే విధంగా చేతులపై, మెడపై భుజాలపై వివిధ రకాల టాటూ డిజైన్‌లు వేయించు కుంటున్నారు. తమకు నచ్చిన వారి పేర్లు, అభిమాన హీరోలు వివిధ రకాల డిజైన్‌లను ఎంచుకుంటున్నారు. వీరికి తగినట్లుగా రకరకాల టాటూ డిజైన్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో నార్మల్, పర్మినెంటు డిజైన్‌లు వస్తుండడంతో టాటూలు వేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. టాటూల్లో అనేక రంగులను పయోగిస్తున్నారు. సెలూన్ షాపుల్లో టాటూలు వేస్తూ డిజైన్‌ను బట్టి రూ. వెయ్యి నుంచి మొదలు రూ. 10 వేల వరకు తీసుకుంటున్నారు.

వెలుస్తున్న విభిన్న సెలూన్‌లు...

జిల్లాలోని పలు పట్టణాల్లో హెయిర్ సెలూన్‌లు అందుబాటులోకి వచ్చాయి. మామూలు హెయిర్ డ్రెస్సింగ్ సెలూన్‌ల నుంచి మోడ్రన్ డ్రెస్సింగ్ సెలూన్‌ల వరకు ఉన్నాయి. పట్టణాల్లో కార్పొరేట్ హెయిర్ సెలూన్‌లు వెలుస్తున్నాయి. సెలూన్‌ల యాజమానులు సైతం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. కొన్ని షాపుల్లో షేవింగ్ రూ.400 తీసుకుంటున్నారు. కటింగ్‌కు రూ.600, కటింగ్, షేవింగ్, ఫేషియల్స్ చేసుకుంటే రూ. 1400 నుంచి 1600 తీసుకుంటున్నారు.



స్టైల్ హెయిర్ కటింగ్‌తో యువకులు

అభిరుచికి తగినట్లుగా కటింగ్

జంపాల రవీందర్, సెలూన్‌షాప్ నిర్వహకుడు, మంచిర్యాల



వెరైటీ హెయిర్‌స్టైల్ కోసం యువత మొగ్గు చూపుతున్నారు. అభిమాన హీరో, క్రికెట్ క్రీడాకారుల మాదిరిగా కటింగ్ చేయాలని వస్తున్నారు. వారి అభిరుచికి తగినట్లుగా కటింగ్ చేస్తాం. శిక్షణ పొందిన వారితో పలు రకాల కటింగ్‌లను చేయిస్తాం.

టాటూలపై క్రేజ్ పెరిగింది

సాయి వర్మ, హెయిర్ సెలూన్ నిర్వహకుడు, బెల్లంపల్లి



నలుగురిలో ప్రత్యేకంగా కనిపించడం కోసం యువత టాటూలు వేసుకుంటున్నారు. గతంలో కేవలం గ్రీన్ టాటూ మాత్రమే అందుబాటులో ఉండగా ప్రస్తుతం వివిధ డిజైన్‌లలో డిఫరెంట్ వెరైటీలతో టాటూలు వేస్తున్నాం. మల్టీ కలర్స్‌తో వేసుకోవడం ప్రస్తుతం క్రేజీగా మారింది. వారికి నచ్చిన వారి పేరు లేదా ఫోటో, ఇష్టపడే దేవతల ఫోటోలను, వివిధ డిజైన్‌లను టాటూలుగా వేసుకుంటున్నారు.

ఫ్యాషన్‌గా ఉండడం ఇష్టం

అరుణ్, బెల్లంపల్లి



ఫ్యాషన్‌గా ఉండడం ఇష్టం. అందుకు తగినట్లుగానే నేను హెయిర్ స్టైల్ బ్రేడ్ చేయించుకోవడంతో టాటూ వేయించుకుంటున్నాను. గతంలో హైద్రాబాద్‌కు వెళ్లి టాటూ వేయించుకునేవాన్ని. ప్రస్తుతం స్థానికంగానే టాటూ సెంటర్లు ఏర్పాటు చేశారు.



దుర్వాసనతో వేగేదెలా...?

(5వ పేజీ తరువాయి..)

తాత్కాలిక డంప్ యార్డులో మున్సిపాలిటీ చెత్తను వేస్తున్నారే తప్ప, శాశ్వత పరిష్కారానికి కృషి చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాత్కాలిక డంప్ యార్డులుగా రాళ్ల వాగు ఒడ్డు, గోదావరి తీరం, బైపాస్ రోడ్డు, అండాళమ్మ కాలనీ సమీపంలోని జాలా గుట్టలను ఉపయోగిస్తున్నారు. అక్కడ వేసే మున్సిపాలిటీ చెత్తతోపాటు చికెన్ సెంటర్ల వ్యర్థాలు పేరుకుపోతుండటంతో మున్సిపల్ సిబ్బంది వారానికోసారి కాల్చి వేస్తున్నారు. వాటిని కాల్చే సమయంలో దట్టమైన పొగతోపాటు, దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. కాలనీవాసుల ఆందోళనలతో నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొంత స్థలం కేటాయించారు. స్థలం కేటాయించి సంవత్సరాలు గడుస్తున్నా అక్కడ చెత్తను డంప్ చేయకుండా మళ్లీ అండాళమ్మ కాలనీలో వేస్తున్నారు.

కాలుష్యంతో ఇబ్బందులు....

ఇదిలా ఉండగా అండాళమ్మ కాలనీలో డంప్ యార్డులో ఉన్న చెత్తను అక్కడి నుంచి ఎత్తివేసి కొద్ది రోజులుగా సమీపంలోని రహదారిని ఆనుకొని వేస్తున్నారు. ఎక్స్‌కావేటర్ సహాయంతో చెత్తను రోడ్డు పక్కన వేస్తుండటంతో ఆ ప్రాంతమంతా కాలుష్యం వెదజల్లుతోంది. కాలనీతోపాటు గ్రీన్‌సిటీ, పవర్ సిటీ కాలనీ రంగంపేట ప్రాంతాల్లో కాలుష్యం వ్యాపిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త తగులబెడుతున్న ప్రాంతానికి సమీపంలో నివాస గృహాలతోపాటు మిషన్ భగీరథ నీటి ట్యాంకు, ఫంక్షన్ హాళ్లు, స్పోర్ట్స్ క్లబ్, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఉన్నాయి. ప్రజలతోపాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ ట్యాంకు చుట్టూ చెత్త కుప్పలు పోస్తుండటంతో అక్కడికి వెళ్లేందుకు వీలుగాక రెండు రోజులుగా మంచినీరు విడుదల చేయలేదని కాలనీ వాసులు చెబుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

డంప్‌యార్డును తరలించాలి

రమణారావు, గ్రీన్‌సిటీ కాలనీ



రెండు సంవత్సరాల క్రితం గ్రీన్‌సిటీ కాలనీలో ఇల్లు నిర్మించుకున్నా. సమీపంలోని అండాళమ్మ కాలనీలో మున్సిపల్ డంప్‌యార్డు ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. పైగా చెత్తను కాల్చడంతో దట్టమైన పొగతో కాలుష్యం బారిన పడాల్సి వస్తోంది. అధికారులు పట్టించు కోవడం లేదు. ఇప్పటికైనా డంప్‌యార్డును తొలగించకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు పూనుకోవలసి వస్తుంది.

స్వీప్‌పై అవగాహన



చెన్నూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొక్కూరు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు స్వీప్‌పై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. హెచ్‌ఎందత్తకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్తీక పూజలు... దీపదానాలు



గూడెంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి,నవంబరు12 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఏకాదశి పురస్కరించుకొని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. గోదావరిలో స్నానాలు ఆచరించి దీపాలను వదిలారు. సుమారు 250పైగా భక్తులు కుటుంబ సమేతంగా స్వామి వ్రతాన్ని ఆచరించారు. భక్తులు కార్తీక దీపాలను దానం చేశారు. అనంతరం ధ్వజస్తంభం, రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. బుధవారం సాయంత్రం తులసి కల్యాణం నిర్వహిస్తున్నామని, భక్తుల సౌకర్యాలకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

పులిహోర, మజ్జిగ పంపిణీ

గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఈనెల 15 వరకు ఉచితంగా అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేస్తామని తెలిపారు. లక్కాకుల సృజన్, సిరికొండ నవీన్, నాయకులు రమేష్ శ్రీధర్, రాజయ్య, నరేష్, అనిల్, లక్ష్మణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్షీరాబ్ధి ద్వాదశి పూజలు

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో వచ్చే క్షీరాబ్ధి ద్వాదశి ప్రత్యేకమైనది. పాలసముద్రాన్ని చిలకడం ప్రారంభించిన రోజు.. అందుకని దీనిని చిలుక ద్వాదశి అని, క్షీరసాగరాన్ని గుర్తుగా క్షీరాబ్ధి అని కూడా అంటారు. బుధవారం క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా... పాలకడలి నుంచి ఉద్భవించిన క్షీరాబ్ధి కన్య శ్రీ మహాలక్ష్మి విష్ణువును వివాహం చేసుకున్నది కూడా ఈ రోజే. అందుకు గుర్తుగా క్షీరాబ్ధి ద్వాదశి అంటారని పండితులు చెబుతున్నారు. ఏకాదశి రోజు యోగ నిద్ర నుండి మేల్కొన్న శ్రీ మహావిష్ణువు ద్వాదశి రోజు మహాలక్ష్మితో కలిసి భూలోకానికి వస్తాడట. విష్ణువు కొలువైన ఉసిరిని మహాలక్ష్మిగా భావించి తులసికి కల్యాణం జరిపిస్తారు.

ప్రత్యేక పూజలు చేయాలి: వంశీ కృష్ణ శర్మ, పూజారి, నస్పూర్

క్షీరాబ్ధి ద్వాదశి రోజే మహాలక్ష్మిని విష్ణువు వివాహం చేసుకున్నట్లు పురాణాల్లో ఉంది. మహాలక్ష్మి సమేతంగా విష్ణువు తులసి వనంగా ఉంటాడు. అందుకని తులసిని అందంగా అలంకరించి లక్ష్మి నారాయణులను పూజిస్తే ఐశ్వర్యం కలుగుతుంది. విష్ణు స్వరూపంగా భావించి ఉసిరిని తీసుకొచ్చి తులసి మొక్కలో పెట్టి పూజ చేయాలి.



పండితుడికి కార్తీక దీపాలను దానం చేస్తున్న మహిళలు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సహకార సంఘం చైర్మన్

దండేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని లక్సెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు అన్నారు. మంగళవారం ఐకేపీ ఆధ్వర్యంలో రెబ్బనపల్లి, కొర్విచెల్మ, కొత్త కొమ్ముగూడెం, దండేపల్లి, కొత్తమామిడిపల్లి, మ్యాదరిపేట, గుడిరేవు తాళ్ల పేటలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని, మద్దతు ధర ఏగ్రేడ్ రకానికి రూ. 2350,సాధారణ రకానికి రూ 2300లతో పాటు క్వింటాల్‌కు రూ 500 బోనస్ పొందాలన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైస్ చైర్మన్ ఎండి ఆరిఫ్, డైరెక్టర్ రాకేష్, విజయ్, జంగు, మాజీ జెడ్పీటీసి గడ్డం నాగరాణి, మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకెనపల్లి, బుచ్చయ్యపల్లి, పెద్దదుబ్బ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సహకార సంఘం చైర్మన్ చింతం స్వామి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాం చందర్‌లు ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. ఎంపీడీవో మహేంద్ర, ఏవో ప్రేమ్‌కుమార్, ఏపీఎం శ్యామల, సీసీ రామకృష్ణ, వీవోఏలు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేంద్రపాణి



సమావేశంలో పాల్గొన్న ట్రస్మా నాయకులు

శ్రీరాంపూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీరాంపూర్ కాలనీకి చెందిన మల్లెత్తుల రాజేంద్రపాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఊరు శ్రీరాంపూర్ చెందిన పెట్టం మల్లయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లక్సెట్టిపేటకు చెందిన చిందం చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ట్రస్మా సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లో సమావేశమై ఎన్నికలు నిర్వహించారు. రాజేంద్రపాణి మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల అభివృద్ధికి కృషి

మందమర్రిటౌన్ (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణిలు తెలిపారు. మంగళవారం హైద్రాబాద్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర నాయకులు మల్లయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డీఎం

చింతలమానేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రవీంద్ర నగర్-1 గ్రామంతో పాటుమండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం డీఎం జీవీ నర్సింహా పరిశీలించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో 'ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఇబ్బందులు పడుతున్న రైతులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. మండలంలో రెండు కేంద్రాలను పరిశీలించారు. రైతులు ఇప్పుడే వరి కోతలు కోయడంతో తేమ శాతం ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. వడ్లను ఆరబెట్టి తేమ శాతం 17కు మించకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అన్నారు. సెక్టార్ ఇన్‌చార్జిత తాజీమ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు నుంచి పాండవుల లంకకు...

పాదయాత్ర ద్వారా చేరుకున్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన పలువురు భక్తులు లక్ష్మీదేవి, గోపాలకృష్ణ ప్రతిమలతో ఐదురోజుల పాదయాత్ర చేసి మండలంలోని వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట గ్రామాల మధ్యన రామగిరి కొండల్లో ఉన్న పాండవుల లంకకు మంగళవారం చేరుకున్నారు. పాండవలంక ప్రాంతంలో వెంకటేశ్వరస్వామి, సరస్వతి, గణపతి, పంచపాండవులను మూడు నిద్రలు చేసి పూజించనున్నట్లు వారు తెలిపారు. కార్తీకమాసం సందర్భంగా చెన్నూరు నుంచి పాండవలంకకు శివునిపూజ కోసం వచ్చినట్లు భక్తులు తెలిపారు.



దేవుళ్ల ప్రతిమలతో పాండవుల లంకకు చేరుకున్న భక్తులు

మహాసభల కరపత్రాలు విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

గర్మిళ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం యుఎస్ఎఫ్ఐ ఆలిండియా మహాసభల కరపత్రాలను జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 14, 15 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సభకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రమేష్, సరిత, రమ్యమేఘన, క్రాంతికుమార్, భీమేష్ పాల్గొన్నారు.

సీతారాంపల్లిలో న్యాయవిజ్ఞాన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న అర్పిత మారం రెడ్డి

నస్పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీతారాంపల్లి రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పురుగు మందులు, విత్తనాల చట్టం, వ్యవసాయ భూమి కౌలు, అనువంశిక వారసత్వాలకు సంబంధించిన చట్టాలపై రైతులకు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారం రెడ్డి వివరించారు. రైతులకు సలహాలు, సహాయానికి 15100 టోల్ ఫ్రీ నంబరు ఫోన్ చేయాలని సూచించారు. డిఫెన్స్ కౌన్సిల్ ఎండి సందాని, ఆర్ ఆర్ రాములు, మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, వ్యవసాయ శాఖ అధికారులు, పాల్గొన్నారు.

ఆందోళనకరంగా విద్యార్థిని శైలజ ఆరోగ్యం

వాంకిడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వాంకిడి ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురై హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న శైలజ ఆరోగ్యం మంగళవారం ఆందోళనకరంగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. శైలజ గత నెల 30న వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైంది. ఆమెను మంచిర్యాల ప్రైవేట్ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా మంగళవారం శైలజ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు చెబుతున్నారు. మంగళవారం రాత్రి శైలజ పరిస్థితిపై విద్యార్థిని కుటుంబికులు ఆందోళనకు గురైనట్లు తెలిసింది.

అందరూ ఉన్నా అనాథగా...

- గెంటేసిన కుటుంబ సభ్యులు
- మూడు నెలలుగా షెడ్డు కిందే
- భిక్షాటన చేస్తూ జీవనం



కొనుకుంట్ల తిరుపతిరెడ్డి

మందమర్రి టౌన్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): అందరూ ఉన్నా అనాథలా కాలం వెళ్ల దీస్తున్నాడు... కుటుంబం కోసం కాయకష్టం చేస్తూ రెక్కలు ముక్కలు చేసుకొన్నాడు... వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసు కోవాల్సిన కుటుంబ సభ్యులే ఇళ్ళు అమ్మి డబ్బులు తీసుకొని గెంటేశారు... ప్రస్తుతం అతడు బిక్షాటన చేస్తూ బతుకు పోరాటం కొనసాగిస్తున్నాడు. వివరాల్లోకి వెళితే... కరీంనగర్ జిల్లా వావిలాలకు చెందిన కొనుకుంట్ల తిరుపతిరెడ్డి దాదాపు 50 సంవత్సరాల క్రితం మందమర్రికి వచ్చాడు. ఎడ్లబండి నడు పుతూ జీవనం సాగించాడు. అనంతరం పాలచెట్టు ఏరియాలోని కోల్‌బెల్ట్ రోడ్డు పక్కన ఇల్లు కట్టుకొని జీవనం సాగించాడు.

ఊరిలో ఉన్న రెండు ఎకరాల పొలాన్ని అమ్మి కూతురు వివాహం చేశాడు. కొడుకును చదివించాడు. వయసు మీద పడడంతో ఎడ్లబండి పనికి స్వస్తి చెప్పాడు. కుమారునికి కారు కొనిచ్చాడు. కుటుంబ సభ్యుల బలవంతంతో మందమర్రిలోని ఇంటిని రూ.15 లక్షలకు విక్రయించాడు. వచ్చిన డబ్బులతో హైదరాబాద్‌లో ఇల్లు కొనుకున్నారు. కొద్ది రోజులపాటు వారితోనే ఉన్న తిరుపతిరెడ్డిని కుటుంబ సభ్యులు తరచూ గొడవపడడం, కొట్టారని ఆయన పేర్కొన్నారు. దీంతో మనస్తాపంతో ఇన్నేళ్ళు బతికిన మందమర్రికి వచ్చాడు. ఎంపీటీసీ పక్కన ఉన్న షెడ్‌లో పడుకుంటున్నాడు. తెలిసిన వారు తోచిన సహాయం చేస్తే తింటున్నానని పేర్కొన్నాడు. చావైనా బతుకైనా ఇక్కడే అని తెలిపాడు. కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. తిరుపతిరెడ్డి వృద్ధాప్యంలో పడరాని పాట్లు పడుతున్నాడు. కుటుంబ సభ్యులు అందరు ఉన్నా ఒంటరి పోరాటం చేస్తున్నాడు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం జిల్లా వార్తలు
8
బుధవారం 13 నవంబరు 2024





ఆసిఫాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రం

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందేదెప్పుడు?

- పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తల నిరీక్షణ
- నాలుగు నెలలు గడుస్తున్నా పట్టించుకోని సర్కార్
- ప్రభుత్వం కనికరించాలని వినతి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 65 ఏళ్ల పైబ డిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తప్పించి నాలుగు నెలలు గడుస్తున్నాయి. ఇప్పటికీ ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేతనం లేకపోవడం, పెన్షన్ మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. వెంటనే పెన్షన్‌తో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతున్నారు. అంగన్‌వాడీలలో తప్పనిసరి రిటైర్‌మెంట్ అమలు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రభుత్వ నిర్ణయం మేరకు 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఈ ఏడాది జూలైలో ఉద్యోగ విరమణ పొందారు. జిల్లాలో 31 మంది టీచర్లు, 125 మంది అయాలు రిటైర్ అయ్యారు. కాగా అరకొర వేతనాలతో ఇన్నాళ్లు కుటుంబాన్ని నెట్టుకుట్టు వచ్చినవారు ఇప్పుడు ఆ ఆసరా కూడా లేకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. మరోవైపు ప్రభుత్వం రటైర్‌మెంట్ బెనిఫిట్స్ కానీ, పింఛన్ కానీ అందించకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులతో..

అంగన్‌వాడీ కార్యకర్తలకు తప్పనిసరి రిటైర్‌మెంట్‌ను ఆమలు చేస్తున్న ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ. లక్ష, ఆయాలకు రూ. 50వేలు ఇస్తామని మొదట్లో ప్రక టించింది. దీనిపై అంగన్‌వాడీ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అరకొర వేత నాలతో మూడు, నాలుగు దశాబ్దాలు పని చేశామని ఇప్పుడు ఈ కొద్దిపాటి డబ్బులతో ఎలా బత కాలని ప్రశ్నించారు. వారి ఆందోళనపై ప్రభుత్వం సమీక్షించి ఉద్యోగ విరమణ చేసిన టీచర్లకు రూ. 2లక్షలు, ఆయాలకు రూ. లక్ష చొప్పున ఇస్తామని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క స్వయం గా ప్రకటించారు. కాగా ప్రభుత్వం వృద్ధులకు ఇచ్చే ఆసరా పెన్షన్ ఇస్తామని మీఈ ఇచ్చింది. పదవీ విరమణ పొంది నెలలు గడుస్తున్నా హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో పదవీ విరమణ చేసిన టీచర్లు, ఆయాలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంత కాలం జీతంతో ఇబ్బందులు లేకుం డా బతికామని, ఇప్పుడు ఇబ్బందిగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి..



- లలితాదేవి, రిటైర్డ్ అంగన్‌వాడీటీచర్, ఆసిఫాబాద్

ప్రభుత్వం పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి, 65 ఏళ్లు దాటాయని ఉద్యోగం నుంచి తొలగించారు. బత కడం కష్టంగా మారింది. నాలుగు దశాబ్దలుగా ఉద్యోగం చేశాం. ప్రభుత్వం కనికరించాలి.

బెనిఫిట్స్ అందలేదు..



- ఇందిర, రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్, వాడిగూడ

వయస్సు అయిపోయిందని ఉద్యోగం నుంచి తొలగించారు. 40 ఏళ్లకు పైగా ఉద్యోగం చేసిన తమను ఉత్తి చేతులతో పంపించారు. నాలుగు నెలలు గడిచిని బెనిఫిట్స్ అందలేదు.

ఉన్నతాధికారులకు పంపించాం..



- భాస్కర్, జిల్లా సంక్షేమాధికారి

పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తల విషయాన్ని ఉన్నతాధి కారులకు పంపించాం. జిల్లాలో 31 మంది టీచర్లు, 125 మంది ఆయాలు రిటైర్ అయ్యారు. ప్రభుత్వం నుంచి మంజూరైన వెంటనే అందజేసేందుకు చర్యలు తీసుకుంటాం.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

- ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకుడు సురేంద్రమోహన్



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా పరిశీలకుడు సురేంద్ర మోహన్

ఆసిఫాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తప్పులు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీల కులు కె సురేందర్‌మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావులతో కలిసి ఎన్నికల అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారు లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిదులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రాజకీయ పార్టీల ప్రతినిదుల సమన్వయంతో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని అన్నారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి తమ ఏజెంట్లను నియమించాలని, జాబితా రూపకల్పనపై అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నిల అధికారి వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి అధికారిని నియమించామని చెప్పారు. ఈ నెల 28వ తేదీ వరకు ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపు కోసం దరఖాస్తులు స్వీకరించ నున్నా మని తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో అన్ని పోలిం గ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు సవరణ శిబిరం నిర్వహించామని తెలిపారు. తుది జాబితా జనవరి 6, 2025న ప్రకటించేందేకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. అంతకు ముం దు మొదటి సారిగా జిల్లా కలెక్టరేట్‌కు వచ్చిన ఓటరు జాబితా పరిశీల కులకు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతి నిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ దీపక్‌తివారి



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్‌తివారి

వాంకిడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. మంగళవారం వాంకిడి ఆశ్రమపాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలు, గదులు, రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడానికి గల కారణాలను సిబ్బందిని, విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తాజా కూరగాయాలు. సరుకులను వినియోగించుకోవా లన్నారు. అపంతరం మండల కేంద్ర ంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా సదర్శించి వార్డులు, మందుల నిల్వలు, రికార్డులను పరిశీలిం చారు. కార్యక్రమంలో ఆర్‌డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, డీటీడీవో రమాదేవి, తహసీల్దార్ రియాజ్‌అలీ, మండల ప్రత్యక అధికారి రాథోడ్ భిక్కు, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ఖాజా అజీజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కనకరాజుకు ఘన నివాళి



కనకరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సభ్యులు

జైనూర్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లవాయి గ్రామంలో మంగళవారం రాణి దుర్గావతి మహిళ ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు గోడాం జంగుబాయితో పాటు సభ్యులు పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా జంగుబాయి మాట్లాడుతూ గుస్సాడీకి ప్రపంచ వ్యాప్తంగా ప్రాముఖ్యం లభించేలా చేసిన కనకరాజు మరణం ఆదివాసీ సమాజానికి తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షు రాలు ఉయిక తులసీబాయి, ప్రధాన కార్యదర్శి ఆత్రం తులసీ బాయి, కోవ పంచుబాయి, కుంర రాంబాయి, అనక రాంబాయి, ఆత్రం తీర్థబాయి, ఆ త్రం ఏత్మబాయి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

తిర్యాణి ఏవోగా వినయ్

తిర్యాణి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండల వ్యవసాయాధికారిగా విన య్ మంగళవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇటీవల ఇక్కడ ఏవోగా బాధ్యతలు నిర్వహించిన తిరుమలేశ్వర్ బదిలీపై కరీంనగర్‌కు వెళ్లగా నూతనంగా వినయ్ బాధ్యతలుగా స్వీకరించారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

వాంకిడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వ హించాలని సూపర్‌వైజర్ పాండురంగ అ న్నారు. మంగళవారం మండలంలోని ఖమా న గ్రామంలో జరుగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. సర్వేలో ఎటాంటి తప్పిదాలు జరగకుండా చూడాలన్నారు. అన్ని అంశాలను సర్వేలో నమోదు అయ్యే లా చూడాలని సిబ్బందికి సూచించారు.

అనుమతులు తీసుకోవాలి

ఆసిఫాబాద్, నవంబరు 12: జిల్లాలో దివ్యాంగుల సంక్షేమానికి నిర్వహించే ఆశ్ర మాలు, పాఠశాలలు, వివిధ సంస్థలు తప్ప ని సరిగి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా దివ్యాంగుల, వయో వృద్ధుల, ట్రాన్స్ జెండర్ల సంక్షేమశాఖాదికారి ఆడెపు బాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ఆశ్రమాలు, సంస్థలు న్విహించినట్లయితే కఠిన చర్యలు తీసుకుం టామని పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 14వ తేదీలోగా సంక్షేమ శాఖ కార్యాల యం లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 15వ తేదీ తరువాత రిజిస్ట్రేషన్ లేని సంస్థ లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరి పంట పరిశీలన

రెబ్బెన, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామంలోని వరి కులాలను కృషి విజ్ఞాన కేంద్రంకు చెందిన శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, మధుకర్ మంగళవారం పరిశీలించారు. పంటల దిగుబడి, నాణ్యత, ఇతర వివరాల ను రైతుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం నిర్వహించ తలపెట్టిన భూ సేకరణ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, అదనపు కలె క్టర్, ఆర్డీవో, మండలాధికారి, తహసీల్దార్‌పై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన ఆవరణలో మంగ ళవారం అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాదికారులపై దాడికి పాల్ప డ్డారని, ఈ నేపథ్యంలో సామాన్య ఉద్యోగికి భద్రత లేద ని, అధికారులై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు మధుకర్, ప్రమోద్, డీపీఓ భిక్షపతిగౌడ్, జడ్పీ సూపరింటెండెట్ తోటాజీ, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేందర్ కోరారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడి: దాడికి నిరసనగా ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు నిరసన వ్యక్తం చేశారు. వెంటనే దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో జావీద్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: దాడికి నిరసనగా ఎంపీడీవో, తహసీల్దార్ కా ర్యాలయాల్లో అధికారులు నిరసన తెలిపారు. కార్యక్ర మంలో తహసీల్దార్ దత్తప్రసాద్‌రావు, ఎంపీడీవో అంజద్‌పాషా, డీటీ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : ఐకేపీ వీవోఏల ధర్నా




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఐకేపీ వీవోఏలు

ఆసిఫాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ వీఓలేకు గ్రామ సమా ఖ్యల నుంచి రావాల్సిన వేతనా న్ని వెంటనే చెల్లించాలని, స్త్రీ నిధి ఇన్సెంటీవ్, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయా లని, కనీస వేతనం రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికులు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సర్కారు పట్టించుకోకుంటే దశలవారీగా ఆందోళనలు చేపడుతామని తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్డీవో దత్తారాంకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, రాజేందర్, త్రివేణి, బుద్దు, దినకర్, రమ, రోజ, సంతోష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

బెజ్జూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నర్సరీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో గౌరి శంకర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళ వారం కార్యదర్శులతో సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ రాబోయే ఏడాది కోసం ఇప్పటి నుంచే గ్రామాల్లో ఎక్కడ నర్సరీలు ఏర్పాటు చేయాలనే దానిపై ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కార్యదర్శులు సిద్దంగా ఉండాల న్నారు. అదే విధంగా గ్రామ పంచాయతీలో పారిశుద్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహించాలని సూచించారు. కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఓ రజినీకాంత్ తది తరులు ఉన్నారు.

కన్నుల పండువగా లక్షదీపోత్సవం



అమ్మవారి వద్ద దీపాలతో అలంకరణ

కాగజ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని ఈసుగాం శివా లయంలో మంగళవారం లక్షదీపోత్సవ వేడు కలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ముద్దు నరహరి శర్మ, కమలా కర శర్మ పూజ కార్యక్రమాలను చేపట్టారు. గణ పతి పూజ, పుణ్యావాచనం కార్యక్ర మాలను నిర్వహించారు. అనంతరం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు లక్ష దీపోత్సవ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో సిర్పూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, ఈసుగాం శివమల్లన్న ఆలయ కమిటీ చైర్మన్ మైలారపు మురళీధర్, కాంగ్రెస్ నాయకుడు రావి మురళితో పాటు పట్టణానికి ప్రముఖులు, వివిధ సం ఘాల నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో రూరల్ సిఐ శ్రీనివాస్, ఎస్సై రామన్ కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



లక్ష దీపోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

భక్తుల మహాపాదయాత్ర

- కాగజ్‌నగర్ నుంచి టోంకిని ఆలయం వరకు కొనసాగింపు - ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో రాక



టోంకిని ఆలయం వద్ద భక్తుల సందడి

కాగజ్‌నగర్/సిర్పూరు(టి), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్-సిర్పూరు(టి)లోని టోంకిని ఆలయం వరకు మంగళవారం మహాపా దయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాగజ్ నగర్ పట్టణంలోని హనుమాన్ ఆలయంలో పాదయాత్ర జెండాకు ఆలయ పూజారి నారా యణ శర్మ పూజలు చేశారు. అనంతరం మహా పాదయాత్ర కాగజ్‌నగర్ భజరంగ్‌దల్ చౌక్ నుంచి ప్రారంభమై సర్‌సిల్క్ మీదుగా డాడాన గర్ చౌరస్తా, వేంపల్లి, సిర్పూరు(టి), టోంకిని హనుమాన్ ఆలయం వరకు కొనసాగింది.

- ఉమ్మడి జిల్లా నుంచి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు కాగజ్‌నగర్ పట్టణానికి సోమవారం రాత్రి చేరు కున్నారు. మంగళవారం ఉదయం ఇక్కడి నుంచి పాదయాత్రగా బయలు దేరారు. కాగజ్‌నగర్, వేంపల్లి, సిర్పూరు(టి), టోంకిని ప్రాంతాలు రామనామస్మరణ, హనుమాన్ చాలీసా పారా యణం చేస్తూ పాదయాత్ర నిర్వహించారు. భక్తు లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో కౌటాల సీఐ ముత్తం రమేష్, సిర్పూరు(టి) ఎస్సై ఎం.కమలాకర్‌తో పాటు సమీప మండలాల ఎస్సైలు బందోబస్తు నిర్వహించారు.

- ప్రత్యేక పుజలు..

కాగజ్‌నగర్ నుంచి నిర్వహించిన మహాపాద యాత్రకు సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు టోంకిని చేరుకొని పూజలు ని ర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కా ర్యక్రమాన్ని వడ్డించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. సిర్పూరు సివిల్ కోర్టు న్యాయవాది అజయ్ వల్లాల పూజలు చేశారు. సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పూజల్లో పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ హనుమాన్ ఆలయాన్ని సంద ర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్ర మంలో ట్రస్టు సభ్యులు మహావీర్ ప్రసాద్ లో యా, పవన్ కుమార్ సోని, జాగురే మారుతీతో పాటు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- భక్తులకు పాలు, పండ్లు..

కాగా కోసిని వద్ద మాజీ సర్పంచ్ నగునూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తుల కు పాలు పంపిణీ చేశారు. పీఆర్టీయూటీ ఎస్ ఆధ్వర్యంలో అరటి పండ్లను పంపిణీ చేశారు. సిర్పూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావిశ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు పాలు పంపిణీ చేశారు. సిర్పూరు(టి) మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ డీలర్స్ కుర్షిద్ హంస్సేన్ పాదయా త్ర వచ్చే భక్తులకు అరటి పండ్లు, నీళ్ల ప్యాకెట్లు పంపిణీ చేశారు. కోనేరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ కోనేరు వంశీ బాదాం పాలను పంపిణీ చేశారు. సి ర్పూరు(టి) మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అస్లంబీన్ అబ్దుల్ ఆధ్వర్యంలో కా ర్యకర్తలు భక్తులకు అరటి పండ్లు వాటర్ ప్యాకె ట్లను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు టెం టు ఏర్పాటు చేసి పాదయాత్రకు వచ్చే భక్తులకు అరటిపండ్లు, నీళ్లు అందజేశారు.



కాగజ్‌నగర్ నుంచి పాదయాత్ర చేస్తున్న భక్తులు



భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు